# కన్నయ్యా కథ

వి. అంగారకరావు

## 1

నులివెచ్చని నెత్తురులో తడసిన అణాకానీ రకం షర్టు అతని వేషం. మతిలేక గతిలేక అతని రెండుచేతుల్ని పట్టుకున్నాయి సంకెళ్లు. చిన్న కుర్రవాడు సైతం అతన్ని "ఎవర్నోచంపేడట" అన్నాడు. పెద్దకుర్రవాడు "హంతకు" డన్నాడు. ఓఆడపిల్ల "దొంగవెధవ ఎలాచంపాడో" అంది. అతన్ని దొంగకూడా చేసిందాపిచ్చిపిల్ల. ఓ యువతి "ఇటువంటివాళ్ళకు చేతులేలా వస్తాయమ్మా" అని రాగం మేళవించింది లేతకరకాల గొంతుల్లో. ఓముసలమ్మ "ఏమిటి! పోయేకాలపు బుద్ధులు పుట్టుకవస్తే! ఇంతే. కలికాలం నిండుప్రాణాల్ని నిలువునాతీసేస్తున్నారు" అని దవడలునొక్కుకుంటూ ముక్కు పదిసార్లు చీదింది అంటుంది. ఇది అతనికథకు ఉపోద్ఘాతం.

## 2

నిజంగా అతను ఎవర్నిచంపేడు? చంపితే ఏమనిచంపేడు, ఎలాచంపేడు - అన్నసంగతిఎవరికితెలుసు? నాకుతెలుసు, చెప్తావినండి. ఆలోచించండి. ఆలోచించి అతని ఆత్మశాంతికి అశ్రువులేమీ విడువనక్కరలేదు. ఊరకనేఊరుకొండి, మీలోమీరే క్రుళ్ళిపొండి.

అతనిపేరు గౌతమబుద్ధుడు కాదు, గాంధీ కాదు, అశోకుడుకాదు. ఏసుక్రీస్తు అసలేకాదు. పేరుకైనా అతడు అవేమీకాదు. అతను ప్రభవించింది ఓఊర్లో, చదువుకుంది స్కూలుపైనలుతరగతి. అదిపేనయిన సంవత్సరం అతని తండ్రి స్వర్గానికో, నరకానికో చేరుకున్నాడు.

"ఆయన" భారతదేశంలో అనేకమంది పేదల్లో నిరుపేద. వంశపారంపర్యంగా వస్తూన్న ఆస్తిపాస్తులూ, జమీందారీలూ లానే, నిరుపేదకొడుకైన అతడూచక్కని నిరుపేద అయ్యాడు. ఇది అతనికథకు ఉపక్రమణ

## 3

కన్నయ్య ఊరంతాతిరిగేడు. వాడెవడికో ఏఊరుతిరిగినా ఎన్నిళ్లుతిరిగినా మూడుసోలలేవు కాని కన్నయ్యకు ఏమాత్రమూ మూడుసోలల ఉద్యోగమైనా దొరకలేదు. అతను ఆలోచిస్తున్నాడు.——

మూటలు మోద్దామంటే. ఏంచెయ్యాను అభిమానం! గుమాస్తా (కాలూక్నేరిలోయివ్వరు గదా) ఏదైనా షావుకారుకొట్లోచేద్దామా? బ్రోకరుపనిచేద్దామా? చేతరాదే! ఎవడి దగ్గరైనా తర్ఫీదుపొందుదామా? ఛీ! సిగ్గు. సిగ్గుమాట, అలా ఉంచు, అసలుఅంతవరకు తిండిఖర్చుఎలా! జంతికలు వేసుకుని జంగెరపట్టుకుబయల్దేరితే, అందుకుమాత్రం పెట్టుబడి నాకెవడిస్తాడు అప్పు. ధాపరుపని చేస్తే! ఛీ ఛీ! నా అభిజాత్యమో! అయినా, అదిఎలాచెయ్యటం? చస్తే —— అమ్మో! అమ్మసంగతి ఎలా?

ఇలాఆలోచించి, ఆలోచించి, బుర్రపాడై, బ్రతుకు అయోమయమై ఇంటికిఅనవసరంగా వెళ్ళేడు మరియింట్లో తిండిఉంటేగదూ? అవసరంగా వెళ్ళటానికీ. అమ్మజబ్బుతో ఉంది.

"అమ్మా" అనికేకవేశాడు.

"ఏం! నాయనా అంది"

"ఎలాగమ్మా బ్రతకటం''

"నాకేంతెల్సు. చదువుకున్నవాడివి నీకు తెలియాలిగాని" అంది అమ్మ. అమ్మమీద మహాకోపం వచ్చింది ఇన్నాళ్లు బ్రతికిందికాని ఎలా బ్రతకటమో తెలీదట. ఇవాళ వంక దొరికింది నా చదువు. చదువుకునిమాత్రం నేను ఏంచేస్తున్నాను? ఈ చదువు నన్ను మూటలు మోయనివ్వదు, చప్రాసీపని చేయనివ్వదు, సిగ్గువిడువనివ్వదు, భయపడకుండా చావనివ్వదు. పూర్తిగా బ్రతుకనివ్వదు. తిండి కూడా తిననివ్వదు ఎందుకూ పనికిరాని వెధవ చదువు. "అసలు దీనిపేరు చదువేనా', అని అనుమానంగా ఉంది.

''ఏమిట్రా ఆలోచిస్తున్నావు, పిచ్చినాయనా మతిచెదర గొట్టుకోకు" అంది అమ్మ

"మరేంచెయ్యను ?

"మళ్ళీ ప్రయత్నించు, మన అదృష్టం బాగుంటే భగవంతుడి దయఉంటే ఏదో నాలుగురాళ్ళుసీవూ సంపాదించకపోవు"

"ఇప్పుడైనా సంపాదించగలను, అభిమానం విడవాలిగాని'' ఈ మాటకు ఆ తల్లి బావురుమని ఏడవబోయింది. కానిమానేసింది, ఎదురుగా పుత్రవాడసలే బెదిరిపోయి ఉన్నాడు తనుకూడా ఏడిస్తే వాడసలే ఏడ్చిపోతాడేమోనని భయంపుట్టింది. ఆవిడకు. మాట్లాడక ఊరుకుంది, కన్నయ్య లేచేడు, తల్లికిదణ్ణంపెట్టేడు. బయటికి వెళ్లిపోయాడు, ఆపేసుకున్న ఏడుపూ, కన్నయ్య దణ్ణంపెట్టినపుడు వచ్చినఏడుపూ కలిపి అతను గుమ్మం దాటిపోయాక బావురుమని ఏడ్చేసింది ఆతల్లి, ఆయింటి కప్పుకూడా ఆఖరుకు ఆవిడ ఏడుపు వినలేదు, మనిషేవిననప్పుడు రాళ్లురప్పలు వింటాయా ?

## 4

కన్నయ్య అదేఊర్లో అవేసందుల్లో అదే బజారులో అదేపనిమీద అనేకసార్లు తిరిగేడు, ఇంతట్లోకి ఓపాతస్నేహితుడు కనుపించి పలుకరించాడు, అందుకు కన్నయ్యకు చాలా ఆనందమయింది. తనక్లాసుమేట్లు ఎందరో తనకు కనపడికూడా పలుకరించేవారుకారు. ఇతనిమాపులు వాళ్ళమాపుల్లో కలవగానే మొగం ప్రక్కకు తిప్పేసుకుని ఎరగనట్టుమొహం పెట్టేవాళ్లు. వాళ్ళింటర్లో, బి యేలు చదువుతున్న స్టూడెంట్లాయె, ఇతన్ని పలుకరిస్తే వాళ్లదిగ్నిటీకి భంగమని వాళ్ళభయం ఇతడివాటం చూసేసరికి వాళ్లకు ఇదేం కౌకబేహార్ప్రా అనేవారు. అంటుకే ఆస్నేహితుడు పలుకరించేసరికి కన్నయ్యకి ఎంతో ఆనందమయింది. ఆస్నేహితుడు స్కూలుఫయినలు వరుసగా రెండేళ్లు ఫేలయి యిప్పుడు వాళ్ళ ఊరిలో సొంతవ్యవసాయం చూసుకుంటున్నాడు

"ఏంచేస్తున్నావ్'' అడిగేడు కన్నయ్యని.

''ఏంచెయ్యటంలేదు" అన్నాడు కన్నయ్య.

"మరిఎలాగ ? "

"ఏమిటి ? ''

ఏఉద్యోగమూలేకపోతే ఎలాగా అని"

"దానికోసమే తిరుగుతున్నాను"

"ఓచిన్నపని ఉందిచేస్తావా ? ఇక్కడ ఓ క్లబ్బుంది. అందులో మాబావ మెంబరు, మాబావ ఈ ఊర్లో ఆఫీసరులే. ఆ క్లబ్బులో ప్యూన్ ఖాళీగా ఉన్నట్టుంది. ప్రయత్నిస్తావా ?"

ఆలోచించాడు కన్నయ్య స్కూలుఫయినలు చదివి క్లబ్బులో కుర్రాడిపనిచేయాలి ఖర్మ! ఖర్మేంటి గాడిదగుడ్డు ఉద్యోగాలు లేనప్పుడు దేశంలో అందరూ ఆఫీసుల్లో ఉద్యోగాలకోసమే ప్రాకులాడుతున్నారు ఉన్నఉద్యోగాలైనా తనలాంటి అభాగ్యులకు దొరకవు అవికూడా భాగ్యమున్న వాళ్ళకే తనతండ్రిలాంటి పేదవాడికి గొప్పవాళ్ళతో, అంటే బొజ్జలుపెంచిన వాళ్ళతో స్నేహం ఎలాగుంటుంది ? అలాస్నేహం ఉంటేగాని రికమండేషను ఎలాగుంటుంది ? అలాజరిగితేనే గాని ఉద్యోగం ఎలాదొరుకుతుంది? అలాదొరికితేనేగాని తనకు ఈ ఆకలిబాధ తప్పేలాగలేదు.

మరిప్పుడు తనకి తప్పుతుంది కదూ ఈ బాధ. ఏదో నౌఖరీ. అసలు లేనిదానికన్నా ఇదే నయం. "ఊ" అని బుర్ర ఊపేడు, స్నేహితుడి మాటకి. వెళ్ళి ప్రయత్నించగా క్లబ్బు ప్రెసిడెండు, సెక్రటరీలు "ఊ" అన్నారు. నెలకు పదిహేను రూపాయల జీతం. దొరికిందే దొరకడం. అడ్వాన్సుగా అయిదు రూపాయలడిగి పుచ్చుకున్నాడు. అమ్మకి ఆయుర్వేద మ్మందూ, పళ్ళూ. పాలూ. కాఫీ పొడుం. పంచదార కొన్నాడు. ఇక రెండు రూపాయలు మిగిలేయి ఓపావలా పెట్టి ఇడ్లీ కాఫీత్రాగేడు. అమ్మతో చెప్పేడు, "అభిమానం వదిలి నౌకరీకి కుదిరాను. ఆతరువాత ఏమవుతూందో" అని అమ్మ ఏడవబోయింది కాని మానేసింది. శుభమా అని నౌఖరీ దొరికితే నవ్వాలి అనుకుంది. కాని నవ్వలేకపోయింది.

## 5

క్లబ్బులో కన్నయ్యకిపని: పేకలు కొనుక్కురావటం, సోడాలు తేవడం, కిళ్ళీలు కట్టించటం, ఆఖరున సానులకు కబుర్లు పట్టుకువెళ్ళడమూనూ —ఏ మెంబరు ఏపని చెప్పినా చెయ్యవలసిందే ప్రెసిడెంటుగారికి కన్నయ్య స్వంత నౌఖరయిపోయాడు. ఆయనకు బజారు చెయ్యడం. అవీ, గూడా కన్నయ్యే. కన్నయ్య ఈ పనిలో చేరిన దగ్గర్నుంచీ మాయ, మోసం నేర్చుకోవాల్సి వచ్చింది. ఆత్మను, స్వతంత్రాన్ని చంపుకుని, ఇతరుల మనోభావాలకి బుర్ర ఊపాలి, దాసుడవ్వాలి. మెంబర్ల మనసులను అనుగుణంగా బసు చేసి అణా బేడా సంపాదించాలి. చదువుకున్నవాడు కాబట్టి వీటన్నిటినీ త్వరలో గ్రహించుకున్నాడు కన్నయ్య. చివరకు అతని 'చదువుకున్న' తనం (కడుపునింపే ఉద్యోగానికి కాపోయినా) ఇందుకైనా ఉపయోగించింది

క్లబ్బు ప్రెసిడెంటుకు, సెక్రటరీకి జాయింటుగా ఓ ఉంపుడుగత్తె ఉంది. దానిపేరు కాంతం ఈ కాంతాన్ని సుబ్బారావు పెళ్ళి చేసుకుంటాడట. సుబ్బారావు ఎవరంటే "ఓత్రాగుబోతు" అంటాడు సెక్రటరీ. "వెధవకబుర్లూ వీడూ" అంటాడు ప్రెసిడెంటు. సుబ్బారావు ఓసంఘాన్ని లేవదీసాడు. ఆ సంఘంపేరు మనకక్కర్లేదు. దాని ఆశయాలు చెప్తావినండి: వ్యభిచారం నిర్మూలించాలి. అందుకు ముందు వ్యభిచారానికి కారణాలు కనుక్కోవాలి. కనుక్కుంటే మొట్టమొదటిది ఆర్థికకారణం అవ్యభిచారిణులకు సంస్కారులు ముందుకువచ్చి మంచి జీవితం చూపించాలి వాళ్ళని ఆ నరకకూపంలోనే ఉంచి, ఏదో కొంత డబ్బు ముట్టజెప్పి, తమ అవసరాల్ని తీర్చుకుపోయే వాళ్ళొత్తిచవటలు. "అందుకే కాంతాన్ని పెళ్ళాడుతాను. మీలా డబ్బు ఆశచూపి దాన్నింకా ఆస్థితిలోనే ఉంచను దానికీహృదయం ఉంది ఆహృదయాన్ని మీరు సరిగ్గా చూడలేదు. అది మీకు చూపదు కూడాను. ఏమి చూపినా తనకు డబ్బు మీదెంత ఆశో చూపి మీ అవసరాల్ని తీర్చిపంపుతుంది. మీరు దానిదగ్గరనుంచి కొనితెచ్చుకుంటారు (అది తెచ్చిపెట్టుకున్న ఉద్రేకంవల్ల ఇచ్చే) సంతోషాన్ని అంతేకాని నాదగ్గిరలా కాదు. నేచెప్పినవన్నీ విని, నాకు నిజహృదయాన్ని విప్పి చూపింది తనకీ వృత్తి ఎలా అలవాటయిపోయి, విడవలేనస్థితికి తీసుకువచ్చిందో చెప్పింది నేను బలవంతించే పెళ్ళికి ఒప్పుకుంది" అన్నాడు సుబ్బారావు. "చూద్దాం, అది నిన్ను పెళ్ళాడినా సరిగా ఉంటుందేమో" అన్నాడు ప్రెసిడెంటు.

"దాని ఆస్తిని వదేసుకోవటానికి చేస్తున్నావీ ప్రయత్నం. సంసారులుగా ఉండి వ్యభిచరించే వాళ్ళ గురించి ఏం చెప్తావ్" అన్నాడు సెక్రటరీ. "నా నిశ్చయాన్ని మార్చడానికి మీరెన్ని వెధవ ప్రచారాలు చేసినా నేను లెక్కచెయ్యను. అస్తి వదేసుకోవటాలు లాంటివి మీలాంటి తుచ్ఛులు చేసే ప్రయత్నాలు. సంసారులుగా వున్న వ్యభిచారిణులగురించి అంటారూ అటువంటి వాళ్ళకు విడాకు లిచ్చేయటం మంచిది" అంటూ వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావు ఇచ్చిన జవాబులకు వాళ్ళరక్తం సలసలా క్రాగిపోయి, ప్రెసిడెంటుకీ సెక్రటరీకి ఎలాగైనా సుబ్బారావును నాలుగు తన్నించాలని బుద్ధిపుట్టింది. కాంతం తనింటికి రావద్దని ఖచ్చితంగాచెప్పేసింది వీళ్ళతో ముహూర్తం నిశ్చయమయింది పెళ్ళికి. పెళ్ళి ఎలాగూ తప్పదని తెలుసు వాళ్ళకు, వాళ్ళకు ఉక్రోషం ఆగటంలేదు. ఏడుపు తగ్గటంలేదు, బాధ ఉపశమించటంలేదు. సుబ్బారావుని నాలుగు తన్నించాలి అప్పుడుకాని వాళ్ళకు తృప్తిలేదు, "నీవు చేస్తున్నది తప్పు"అని స్వయంగా వాళ్ళు తన్నలేరు. ఎవడిచేతనైనా తన్నిస్తారుట

కన్నయ్యను పిలిచేరు సెక్రటరీ ప్రెసిడెంటులు, వెళ్ళేరు కన్నయ్య.

"ఏమోయ్ యెలాగుంది ఇక్కడ నీకు" అన్నాడు ప్రెసిడెంటు.

"బాగానే వుంది"

"అబద్ధమాడుచున్నావు"

"లేదండి"

"ఊరుకోవోయ్, నేమిచ్చే పదిహేను రూపాయలు ఏకేం చాలుతుందోయ్." అంటున్నాడు సెక్రటరీ.

"అయ్యా మీ రూపాయలు ముందే ఇచ్చేరు గదండీ, ఇంక పదిరూపాయలే ఇవ్వాలి అయినా నెల అవ్వాలిగదండీ అప్పుడుకాని యెలా తెలుస్తుంది జీతం చాలిందీ లేందీ"

"ఎలాగైనా ఏం సరిపోతుందోయ్ జీతం" అన్నాడు ప్రెసిడెంటు.

"అవునండి"

"ఇదిగో ఈ పాతిక రూపాయలు తీసుకో"

"ఎందుకండీ"

"ఎందుకంటా వేంటోయ్. పట్టుగెళ్ళు. జీతం జీతంలాగ వస్తుందిలే, విచారించకు"—అన్నాడు సెక్రటరీ.

"ఏమండీ చెప్దామా మనవాడికి"-ప్రెసిడెంట్

"నమ్మకమైనవాడు. ఫర్వాలేదు చెప్పండి" - తాళం వేసేడు సెక్రటరీ.

"ఏమిటండీ", ఏమీ అర్థమవక అడిగాడు కన్నయ్య.

"అప్పే ఏమీ లేదోయ్! సుబ్బారావున్నాడు చూశావా". లౌక్యంగా ప్రెసిడెంట్.

"ఆ! ఆ!" -

"ఎలాంటివాడు?" అడిగేడు సెక్రటరి.

"మీకు తెలియ దేమిటండీ", మరీ లౌక్యంగా కన్నయ్య.

"ఉత్త వెధవోయ్ అతను" - ప్రెసిడెంటు.

"అలాగే ఉన్నాడండి".

"లేకపోతే వెధవ భోగందాన్ని పెళ్ళిచేసుకోవట మేమిటి" - సెక్రటరీ.

"ఏడ్చేడు, తన్నక" - ప్రెసిడెంటు.

"కన్నయ్యలాంటివాడు తల్చుకుంటే వీపు చీరేస్తాడు" - సెక్రటరీ.

"ఏమోయ్ అంతేనా"

"అంతేనండి" ఏమి తోచక. కన్నయ్య

"ఇలా దగ్గరకు రావోయ్" అంటూ ప్రెసిడెంటు (వెళ్ళేడు కన్నయ్య) "సాయంత్రం 6 గంటలు దాటేక టీపీలో ఉంటాడు అదీ సమయం వాడిని తన్నించేస్తే [illegible]" అన్నాడు ప్రశ్నార్థకంగా సెక్రటరీవైపు చూసి

"అవును అదేసమయం కన్నయ్యా" - సెక్రటరీ

"ఏదో గొడవ పెట్టుకుని చిడగొట్టేయాలి" - ప్రెసిడెంటు

"ఏ సిగరెట్టో కాల్చి వాడిమీద పారెయ్యాలి. అనవసరంగానైనా గొడవతెచ్చుకుని బాదెయ్యాలి"—సెక్రటరీ

"అలా చెయ్యవోయ్ కన్నయ్యా"

"సరేనండి" అన్నాడు ధనంకోసం! జేబులో ఉన్న పాతిక రూపాయలువేపు చూస్తూ. అది గుర్తించి ప్రెసిడెంటు "జీతం పాతికచేస్తాములే" అన్నాడు సెక్రటరీవైపు చూస్తూ

## 6

కన్నయ్య ఒక్కసారి పాతిక రూపాయలు ఎప్పుడూ చూడలేదు అప్పో సొప్పో చేసి తండ్రి పదిహేను రూపాయలు స్కూలు పరీక్షఫీజు కట్టమని యిస్తే అప్పుడు చూసేడు పెద్ద మొత్తాన్ని, మళ్ళా ఇప్పుడు చూసేడు ఇంకో నాలుగు రోజుల్లో ముందు ఇచ్చిన అయిదు రూపాయలు మినహాయించినా (జీతం పాతిక చేస్తామన్నారు గదూ) ఇంకో ఇరవై రూపాయలు చూస్తాడు మొత్తంమీద తనకుదశ యెత్తుకుంటుంది కాబోలు ఇక. వీటన్నింటికీ తోడు అమ్మ కాస్త అటూ ఇటూ తిరుగుతూంది ఇంట్లోకి కావలసిన బియ్యం, కిరాణా వస్తువులు అన్నీ కొన్నాడు అమ్మ యెంతో సంతోషించింది తాను పళ్ళరసం త్రాగి కొడుక్కింత వండిపెట్టింది సంతృప్తిగా భోంచేసాడు. ఇక మనకు ఫరవాలేదని హాయిగా నిద్రపోయారు ఇద్దరూ.

మర్నాడు 6 గంటలకు బీచికి వెళ్ళేడు కన్నయ్య. అనవసరంగానే తెచ్చాడు సుబ్బారావుతో తగవు "బంట్రోతు ముండాకొడుకువి నీకెంత పొగర్రా" అన్నాడు సుబ్బారావు అభిమానం, (చచ్చిపోయింది) నిజంగా ముందుకు వచ్చింది ఈ మాటతో కన్నయ్యకు. తీసి కొట్టేడు సుబ్బారావుని, అతనూ కొట్టేడు. పోరు ఘోరమయింది. సుబ్బారావు వీడు తనతో ఎందుకు గొడవపెట్టుకుందీ ఊహించేడు. ఇది ప్రెసిడెంటు సెక్రటరీల పంపకమేనని గ్రహించుకున్నాడు అతనికి ఒళ్లు మండింది,

తనకు కాంతంపెళ్ళివిషయంలో యెంతమందో విరోధులయ్యారు. అందుకని యెందుకైనా మంచిదని మొలలో బాకు ఉంది అతనిదగ్గిర. ప్రెసిడెంటు సెక్రటరీలకు తంత్రం గ్రహించిన అతని రక్తం ఉప్పొంగి ఆ బాకు తీసాడు, పొడిచేటంత ధైర్యం లేకపోయినా. కన్నయ్యకు బాకు చూడగానే కంగారు పుట్టింది. దాంతో పొడుస్తాడేమోనని భయంవేసింది అమ్మ జ్ఞాపకమొచ్చింది. అమ్మ దిక్కులేనిదవుతాదేమోనని భయంకలిగింది గబుక్కున అతని దగ్గరనుండి ఆకత్తి లాక్కొని తిరిగి అతనిమీదనే ప్రయోగించేడు కన్నయ్య భయోత్పాతంతో. బాకు పిడివరకు దిగిపోయింది. కన్నయ్య అలానే నిలబడ్డాడు. ఇదంతా చూసి నలుగురూ పోలీసులకోసం పరుగులెత్తేరు.

రేపు తనకి ఉరిశిక్ష విధిస్తారు, తను కోర్టులో యేమని చెప్తాడు "నేనీ హత్య చేయటానికి కారణం ఆకలి వాడు చంపబడటానికి కారణం నా ఆకలి. అందుకు నేను చంపబడటానికి కూడా కారణం నా ఆకలే అంటే మీరు నన్ను ఉరి తీయటానికి కారణం, ఆకలివల్ల కలిగిన, ధనాశవల్ల నేను వీణ్ణిచంపటం అందుచేత అందుక్కూడా నా ఆకలే "మూల" కారణం. యెన్ని విధాలుగా చూచినా ఈ చావులన్నింటికి "ఆకలి" కారణం. నన్ను చంపినంతలో ఈ "ఆకలి" పోదు. మీ భాషలో "ఈ దుర్మార్గం" పోను నన్ను చంపగానే [illegible]. ఆకలిని చంపండి ఈ ఆకలినాకు నిరుద్యోగ సమస్యవల్ల కలిగింది ఈ నిరుద్యోగ సమస్యవల్ల నేను బేవార్సు ఉద్యోగానికి, అభిమానం విడిచి, కుదిరి, నా మనస్సును నీచస్థితికి దిగజార్చుకున్నాను, చంపండి. ఈ నిరుద్యోగ సమస్యని ఈ చావులకి కారణం అయిన "ఆకలి"కి—"మూల" కారణం అయిన నిరుద్యోగ సమస్యని. ఇందులో ఏమీ అతిశయోక్తి లేదు. ఏమంటే నాకు "అలంకారాలు" రావు. నేను పండితుణ్ణిగాను. ఆ పండితుడికీ తిండిలేదు. ఆకలి మాత్రం ఉంది"— అని చెప్తాడు, పోలీసులు వచ్చి అతనికి బేడీలు తగిలించి తీసుకు పోతారు.

ఇంతటితో అతనికథ ఆఖరు. ఇది అతని "కథకు" సంపూర్ణత.